# ఆసాది కథ

ఆది పురాణంలో ఈ కథప్రస్థావన ఉందని చెబుతారు. అమ్మవారిచేత దీవించబడ్డవారు ఆసాదివారని నమ్మకం. ఆసాది ఇంటిపేరుగాగలవారు ఈ కథను ఎక్కువ చెబుతుంటారు. వీరు ఉప్పరి కులస్థులు. మాదిగకులంవారు కూడా ఈ కథను చెబుతారు.

అమ్మవారి ఉత్సవాల లో ముఖ్యంగా ఊరేగింపులలో ఘటం నెత్తిపైన పెట్టుకొని నృత్యం చేస్తూ పూజాదికాలు నిర్వహించిన తర్వాత అమ్మవారిని వర్షం కురిపించవలసిందిగా వేడుకొంటారు. అటువంటి సమయాలలో నృత్యంతోపాటుగా కథాపఠనం ఉంటుంది.

ఆసాదులు ఇప్పటికి ఆటవిక ఆచారాలను పాటిస్తారు. వారు దేవతకు కల్లు నైవేద్యంగా సమర్పిస్తారు. ఆ కల్లును పూజారే స్వయంగా చెట్టునుండి తీసికొనివచ్చి నైవేద్యమును పెడతారు. నైవేద్యాన్ని పెట్టిన తర్వాత అందరూ ప్రసాదంగా స్వీకరిస్తారు.



వీరు కథను 3 రాత్రులు మరియు 9 రాత్రులు చెబుతారు. పెద్దమ్మ కథ, యల్లమ్మకథ, గంగమ్మకథ వర్షం కురిపించుటకొరకు అంకాలమ్మకథ, నల్లమ్మకథ, మారెమ్మకథలను వారి పిల్లలకు వ్యాధులురాకుండా చెబుతారు. ఇవికాక గౌరమ్మకథ, పరశురామునికథ కూడా చెప్పెదరు. వీరు తమ కులం కాపాడుటకు ప్రాణత్యాగం చేసిన వీరతిమ్మమ్మకథను ఎంతో భక్తిభావంతో చెబుతారు.

**ఈ క్రింది వాయిద్యం సహకారంతో కథ చెబుతారు.**

జమిడికలు - 2

మొత్తం నలుగురు కళాకారులు, జమిడికపై ఎల్లమ్మ అమ్మవారి చిన్న పత్రిమ ఉంటుంది.

ఈ బృందాలు అనంతపురం జిల్లాలో 5, కడప జిల్లాలో 1 ఉన్నాయి.

గ్రామదేవత జాతర్లు, గ్రామాల్లో బాగాలేకపోయినప్పుడు శాంతికోసం 5 లేక 10 రాత్రుళ్లు కథ చెప్పించుకొని శాంతి చేసుకుంటారు.

అమ్మవారి వడిబియ్యంగట్టి పల్లకీ మీద కూర్చోపెట్టి గ్రామంలో ఊరేగిస్తారు. చివరి రోజున అమ్మవారికి మంగళహారతులు ఇచ్చి పుట్టింటికి ఆడపడుచును సాగనంపినట్లు సాగనంపుతారు. గుడిలో అమ్మవారి ప్రతిష్ట సమయమున ఈ కథ చెప్పించుకొంటారు.